క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: బేగంపేట, ఐడీపీఎల్, గ్రీన్‌ల్యాండ్స్, ఎయిర్‌పోర్ట్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ బానోతు చరణ్‌సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శీష్‌మహల్,ప్లే గ్రౌండ్, దివ్యశక్తి లేన్, శక్తినగర్, మూసాపేట్ క్రాస్‌రోడ్డు, మూసాపేట్, ఆల్‌సబా హోటల్. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మా టీవీ బిల్డింగ్, మా టీవీ లేన్, హిందూ ప్రెస్, పుల్లారెడ్డి స్వీట్స్, స్నేహలత బిల్డింగ్, ప్రకాష్‌నగర్, రాహుల్ బజాజ్ వెనుక ప్రాంతం, చీకోటి గార్డెన్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సనత్‌నగర్: బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పని చేసేందుకు అతిథి ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మావతి ఓ ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్, తెలుగు, సంస్కృతి, కామర్స్, బీబీఏ, బిజినెస్ అనలిటిక్, డేటా సైన్స్, అప్‌లైడ్ న్యూట్రిషన్, బీబీఏ ఈకామర్స్ ఆపరేటింగ్, బీసీఏ, బయో టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్, పొలిటికల్ సైన్స్, స్టాటిస్టిక్స్, టాక్సేషన్ సబ్జెక్టుల్లో బోధించేందుకు ఆసక్తి గల వారు ఈ నెల 26 వరకు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

మహంకాళి ఏసీపీగా రవీందర్



రాంగోపాల్‌పేట్: మహంకాళి డివిజన్ ఏసీపీగా రవీందర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఏసీపీగా పనిచేసిన రమేష్ బాలానగర్ ట్రాఫిక్‌కు బదిలీ కాగా ఈయన ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని, ఎవరైనా చట్టానికి లోబడి ఉండాలని సూచించారు. డివిజన్ పరిధిలో ఇళ్లలో దొంగతనాలు, షట్టర్ లిఫ్టింగ్‌లపై జాగ్రత్తలు తీసుకుంటామని, నేపాలి గ్యాంగ్‌లు ఇటీవల రెచ్చిపోతున్నాయని వారిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.

డెంగీ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

అమీర్‌పేట: వర్షాకాలంలో డెంగీ వ్యాధుల బారిన పడే అవకాశం ఉంటుందని ప్రజలు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అమీర్‌పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యురాలు డాక్టర్ రేవతి సూచించారు. సోమవారం ఎంటమాలజీ విభాగం అధికారులతో కలిసి బాపూనగర్‌లో డెంగీ కేసుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ వ్యాధి దోమ కాటు వల్ల వస్తుందని, దోమల నివారణకు కావాల్సిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. హాస్టల్స్ ఎక్కువగా ఉన్న నేపథ్యంలో పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వకుండా చూసుకోవాలని సూచించారు. బాపూనగర్‌లో ఒక కేసు నమోదైందని రోగి పరిస్థితి బాగానే ఉందన్నారు. జ్వరంతో బాధపడుతున్న వారి షాంపుల్స్ కూడా సేకరించి వైద్య పరీక్షలకు పంపుతున్నట్లు తెలిపారు.

వర్షం.. అతలాకుతలం



చెరువును తలపిస్తున్న సెయింట్ మేరీస్ రోడ్డు..

బౌద్ధనగర్: ఉరుములు మెరుపులతో దంచికొట్టిన వర్షం ధాటికి బౌద్ధనగర్‌లోని లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ప్రయాణికులు, పాదచారులు అనేక ఇబ్బందులకు గురయ్యారు. పలు బస్తీల్లో డ్రైనేజీలు నిండి మురుగునీరు ఏరులై పారింది. ఆ మార్గన పాదచారులు నడవలేక నానా అవస్థలు పడ్డారు. మరికొన్ని బస్తీల్లో మురుగునీరు ఇళ్లలోకి చేరడంతో నానా ఇక్కట్లక గురయ్యారు.

లాలాపేట: నగరంలో సోమవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి రోడ్లన్నీ చెరువులను తలపించాయి. సాయంత్రం కావడంతో పాఠశాలలు, కళాశాలల నుంచి వచ్చే విద్యార్థులు భయం భయంతో ఇళ్లకు చేరుకున్నారు. రోడ్లపై భారీగా నీరు చేరడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. తార్నాక, లాలాపేట ప్రధాన రహదారులతో పాటు, లాలాపేటలోని లోతట్టు, ఓపెన్ నాలా పరివాహక ప్రాంతాలు సత్యానగర్, ఇందిరానగర్, శ్రీపురి కాలనీ, లక్ష్మీనగర్, చంద్రబాబు నగర్ తదితర ప్రాంతాల్లో భారీగా వరద పారింది.

సనత్‌నగర్: బేగంపేట నాలా పరీవాహక ప్రాంతాలైన అల్లంతోటబావి, బ్రాహ్మణవాడీ, వడ్డెరబస్తీ, మయూరిమార్గ్, చీకోటి గార్డన్, ప్రకాష్‌నగర్ ఎక్స్‌టెన్షన్‌లతో పాటు రాంగోపాల్‌పేట, రెజిమెంటల్‌బజార్, మెక్లోడ్‌గూడ, సెయింట్ మేరీస్ రోడ్డు ప్రాంతాలు నీట మునిగాయి. భారీ వర్షం కారణంగా రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పలుచోట్ల విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.



బౌద్ధనగర్‌లో జలమయమైన రోడ్డు



జలమయమైన మెక్లోడ్‌గూడ







‘డబుల్’ ఇళ్లపై ప్రభుత్వాన్ని నిలదీద్దాం

రాంగోపాల్‌పేట్: ఇళ్లులేని పేద ప్రజలకు డబుల్ బెడ్రూమ్ ఇస్తామని ప్రభుత్వం మోసం చేసిందని రాంగోపాల్‌పేట్ కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్ ఆరోపించారు. డివిజన్‌లోని రాంగోపాల్‌పేట్, గైదీన్ బాగ్, కాచిబోలి ప్రాంతాల్లో సోమవారం డబుల్ బెడ్రూమ్ దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ‘డబుల్’ ఇళ్లపై ప్రభుత్వం మోసం చేసిందని దీనిపై బీజేపీ ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీన ఇందిరాపార్కు వద్ద చేపట్టిన ధర్నా కార్యక్రమానికి ప్రజలు భారీగా తరలి రావాలన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఈ ధర్నా కొనసాగుతుందని చెప్పారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న చీర సుచిత్ర

ఈ కార్యక్రమంలో ప్రతాప్, నరేష్, మహ్మద్ అఫ్జల్, సాయి కుమార్, రషీద్, చీర శ్రీనివాస్, మహేందర్, నరేందర్ పాల్, సతీష్ పాల్గొన్నారు.

అందరిని చల్లంగ చూస్తా

రసూల్‌పురా: బాలంరాయి శ్రీదేవి దండు మారమ్మ అమ్మవారి బోనాల జాతర ఘనంగా ముగిశాయి. సోమవారం మధ్యాహ్నం జరిగిన రంగం కార్యక్రమం మాతంగి స్వర్ణలత పచ్చికుండపై నిలబడి భవిష్యవాణి వినిపించారు. ప్రజల పూజలకు సంతోషంచానని అందరు తన బిడ్డలని చల్లంగా చూస్తానని అన్నారు. త్వరలో నిత్యావసరాలు, కూరగాయల ధరలు తగ్గుతాయని, భక్తులు ఏ పూజలు చేసినా ఆనందంగా స్వీకరిస్తానని అన్నారు. వానలు సమృద్ధిగా కురుస్తాయని భవిష్యవాణిలో వినిపించారు. ఈ కార్యక్రమంలో ఈవో శ్రీనివాస్ శర్మ, సర్వేష్, స్థానికులు ముప్పిడి గోపాల్, క్రిష్ణ హీరాలాల్, శ్రీను పాల్గొన్నారు.



భవిష్యవాణి వినిపిస్తున్న మాతంగి స్వర్ణలత

చెరువు సుందరీకరణకు నిధులు విడుదల

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు ఏడో వార్డు తిరుమలగిరి చెరువు సుందరీకరణ పనుల విషయమై రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నె క్రిశాంక్ చొరవతో రాష్ట్ర ప్రభుత్వం 2.90 కోట్లు మంజూరు చేసింది. క్రిశాంక్ మాట్లాడుతూ.. ఇటీవల మున్సిపల్ శాఖ ప్రత్యేక కార్యదర్శి అర్వింద్‌కుమార్‌ను తాను బోర్డు మాజీ సభ్యులు పి.శ్యామ్‌కుమార్ కలిసి తిరుమలగిరి చెరువు నుంచి మురుగునీరు దారి మళ్లించేందుకు సీవరేజీ పైపులైను ఏర్పాటు, చెరువు సుందరీకరణకు నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశామని తమ అభ్యర్థన మేరకు నిధులు విడుదల చేశారన్నారు. పరిసర కాలనీ, బస్తీల మురుగునీరు చేరి జలకాలుష్యం కారణంగా స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని దోమల బెడదతో అనారోగ్యాలకు గురవుతున్నారని తెలపడంతో నిధులు మంజూరు చేశారని క్రిశాంక్ వెల్లడించారు.


బీరు సీసాతో దాడి చేసిన వ్యక్తిపై కేసు

అమీర్‌పేట: తాను విడాకులిచ్చిన మహిళను వివాహం చేసుకున్నాడనే కోపంతో బీరు సీసాతో దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సైదులు వివరాల ప్రకారం.. బల్కంపేట బీజేఆర్‌నగర్‌కు చెందిన అనిల్‌కుమార్‌కు (40) సరితతో 2008లో వివాహం జరిగింది. మనస్పర్థల కారణంగా విడాకులు తీసుకున్నారు. ఆ తర్వాత సరిత స్థానికంగా ఉండే మనోహర్ పెళ్లి చేసుకుంది. ఈ క్రమంలో మనోహర్‌పై అనిల్ కక్ష పెంచుకున్నాడు. సోమవారం సెలూన్ షాపులో ఉన్న మనోహర్ వద్దకు వెళ్లి దుర్భాషలాడుతూ బీరు సీసాతో దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు అనిల్‌కుమార్‌పై కేసు నమోదు చేశామన్నారు.

దాడికి పాల్పడిన ఏడుగురికి రిమాండ్

బౌద్ధనగర్: కులం పేరుతో దూషించిన కేసులో ఏడుగురిని రిమాండ్‌కు తరలించిన ఘటన వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శంకర్ వివరాల ప్రకారం.. ఈ నెల 16న బోనాల పండుగ పురస్కరించుకొని నిర్వహించిన తొట్టెల ఊరేగింపులో రాంనగర్ ప్రాంతానికి చెందిన రెడ్డిమల్ల నర్సింగ్ రావు అనే వ్యక్తిని పలువురు వ్యక్తులు కులం పేరుతో అసభ్యపదజాలంతో దూషించడమే కాకుండా నర్సింగ్‌తో పాటు అతని కుమారుడు అఖిల్‌పై దాడికి పాల్పడ్డారు. ఈ మేరకు బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దాడికి పాల్పడిన రాంనగర్‌కు చెందిన ధీరజ్(30), సుధీర్ రాజ్(26), రవి ముదిరాజ్(47), కిరణ్ కుమార్(48), బాల సాయిరామ్(30), సాయిరామ్ పద్మశాలి(30), వినోద్ కుమార్(50ను సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి



అడ్డగుట్ట: రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సికింద్రాబాద్ స్టేషన్ ప్లాట్‌ఫాం–1లోని గేట్ నెం. 5 వద్ద ఆదివారం రాత్రి సుమారు 30–35 ఏళ్ల మధ్య వయస్సున్న గుర్తు తెలియని వ్యక్తి అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. ఇది గమనించిన ప్రయాణికులు వెంటనే రైల్వే పోలీసులకు సమాచారం అందజేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అపస్మారకస్థితిలో పడిఉన్న వ్యక్తి వద్దకు వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. అతడి వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు, ఆధారాలు లేవని మృతుడు బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్, బ్లాక్ చెక్స్‌తో కూడిన ఎరుపు రంగు షర్ట్ ధరించి ఉన్నాడని, కుడి చేతిపై భరత్, రేణుక అని హిందీలో పచ్చబొట్టు ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించామన్నారు.

జీహెచ్‌ఎంసీ కార్యకలాపాలు ముమ్మరం చేయాలి

సికింద్రాబాద్: సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో జీహెచ్‌ఎంసీ కార్యకలాపాలు ముమ్మరం చేయాలని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ సూచించారు. ఇటీవల జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ నూతన డిప్యూటీ కమిషనర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన సుధాంశ్ సోమవారం సికింద్రాబాద్‌లో పద్మారావుగౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలువగా ఆయన అభినందించి బల్దియా కార్యకలాపాలను ప్రజలకు చేరువ చేయడంలో మరింత చొరవ తీసుకుంటానన్నారు.

డిక్లరేషన్ పేరుతో బీసీలను మోసం చేసే కుట్ర

లాలాపేట: జనాభాల్లో 52 శాతం ఉన్న బీసీలకు సీఎం పదవితో పాటు 63 ఎమ్మెల్యే సీట్లు తెలంగాణలోని అన్ని రాజకీయ పార్టీలు కేటాయించాలని సదరన్ పొలిటికల్ అకాడమీ అధ్యక్షులు ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ కేవలం 34 ఎమ్మెల్యే సీట్లు కేటాయిస్తామనడం వారిని అవమాన పరచడమే అని, బీసీ డిక్లరేషన్ల పేరుతో కుట్ర చేస్తూ అన్ని పార్టీలు మరోసారి బీసీలను మోసం చేయడానికి సిద్ధపడుతున్నాయని ఆరోపించారు.

విద్యార్థులకు సరిపడే ఉపాధ్యాయులను నియమించాలి

అడ్డగుట్ట: అడ్డగుట్టలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు సరిపడా ఉపాధ్యాయులను నియమించాలని తెలంగాణ తల్లుల సంఘం రాష్ట్ర కన్వీనర్ భాగ్యలక్ష్మి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం అఖిల భారత బాలల హక్కుల పరిరక్షణ వేదిక, తల్లుల సంఘం సభ్యులు మారేడుపల్లిలో జిల్లా డిప్యూటీ ఐఓఎస్ విజయ్‌కుమార్, డిప్యూటీ విద్యాధికారి బాలు నాయక్‌లను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. బాలల హక్కుల పరిరక్షణ, బాల కార్మికులకు బడుల్లో చేరిపించడం, నాణ్యమైన విద్య కోసం కొన్ని సంవత్సరాల నుంచి తాము కృషి చేస్తున్నామన్నారు. వివిధ బస్తీల నుంచి బాల కార్మికులను పని మాన్పించి అడ్డగుట్టలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో చేర్పించినట్లు వివరించారు. ప్రస్తుతం ప్రాథమిక పాఠశాలలో 315 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని, ఈ పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలితో కలిసి 9 మంది ఉపాధ్యాయులే ఉన్నారని అదే విధంగా ఉన్నత పాఠశాలలో 556 మంది విద్యార్థులు ఉండగా, ప్రధానోపాధ్యాయురాలితో కలిపి 16 మంది ఉపాధ్యాయులే ఉన్నారన్నారు. విద్యార్థుల సరిపడా ఉపాధ్యాయులు లేని కారణంగా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదని దీని కారణంగా పలువురు విద్యార్థులు నిరుత్సాహంతో బాల కార్మికులుగా మారే అవకాశం ఉందన్నారు. వినతి ఇచ్చిన వారిలో లక్ష్మీ నారాయణ, ప్రవీణ్ కుమార్, తదితరులు ఉన్నారు.



మండల డిప్యూటీ ఐఓఎస్, డిప్యూటీ ఈవోలకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

‘డీపీఎస్’లో హరితహారం



సాక్షి, సిటీబ్యూరో: మంత్రి కేటీఆర్ పుట్టిన రోజును పురస్కరించుకుని సోమవారం మహేంద్రహిల్స్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఫారెస్ట్ ఆఫీసర్ సలేహా అఫ్రోస్, చైర్మన్ మల్కా కొమరయ్య, సీఓఓ మల్కా యశస్వి, ప్రిన్సిపాల్ నందితా సుంకర, మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విద్యార్థులు మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తమవంతు సహకారం అందించాలని కోరారు.

కాంగ్రెస్‌లో కష్టపడే వారికి తగిన గుర్తింపు

సనత్‌నగర్: కాంగ్రెస్ పార్టీలో కష్టపడే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ఉంటుందని ఆ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ నేత డాక్టర్ రవీందర్‌గౌడ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ఐవాన్‌వాజ్ సన్మాన కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ.. గత 30 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ మైనార్టీల సంక్షేమం కోసం ఐవాన్‌వాజ్ విశేష కృషి చేశారన్నారు. ఆయన సేవలను గుర్తించిన అధిష్ఠానం మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాధ్యతలు అప్పగించడం శుభపరిణామం అన్నారు. కష్టపడే నేతలకు కాంగ్రెస్‌లో గుర్తింపు ఉంటుందనడానికి ఐవాన్‌వాజ్ నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రమేష్, కమల్‌రాజ్, రాజన్న, గోవింద్, శ్రీనివాస్ యాదవ్, మణిమాల, సోఫియా, షాబాద్ సత్యానారాయణ, ప్రతాప్‌నాయక్ పాల్గొన్నారు.



ఐవాన్‌వాజ్‌ను సన్మానిస్తున్న డాక్టర్ రవీందర్‌గౌడ్

నాగులూరి నర్సింహకు నివాళి

చిలకలగూడ : దళిత జనబాంధవుడు, సంఘసేవకుడు నాగులూరి మేడ్చల్ నర్సింహ 46వ వర్ధంతి వేడుకలు నాగులూరి నర్సింహ వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షుడు నాగులూరి సాయిబాబా ఆధ్వర్యంలో చిలకలగూడ జీహెచ్‌ఎంసీ పార్కులో సోమవారం ఘనంగా నిర్వహించారు. మేడ్చల్ నర్సింహ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తన తండ్రి నర్సింహ ఆశలు, ఆశయాల సాధన కోసం తనవంతు కృషి చేస్తానని అసోషియేషన్ అధ్యక్షుడు సాయిబాబా అన్నారు. అనంతరం పలు సామాజిక, ఆధ్యాత్మిక సేవ కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు దళితసంఘ నాయకులు నర్సింహా విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో అసోషియేషన్ ప్రతినిధులు నర్సింహరావు, గిరిధర్‌బాబు, రామచందర్, మల్లేష్, విద్యసాగర్, శ్రీధర్‌రెడ్డి, పోతరాజు శ్రీను,కుమార్, వెంకట్, అంజీ, శంకర్, తుమ్మ శ్రీను, ఆంజనేయులు, రవిశంకర్, సతీష్, ప్రమోద్, రమేష్ పాల్గొన్నారు.



నాగులూరి మేడ్చల్ నర్సింహ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

అందుబాటులోకి రానున్న మాతాశిశు సంరక్షణ కేంద్రం

గాంధీఆస్పత్రి : సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలో రూ.50 కోట్ల వ్యయంతో నిర్మించిన మాతశిశు సంరక్షణ కేంద్ర (ఎంసీహెచ్) భవన సముదాయం త్వరలోనే అందుబాటులోకి రానుంది. సోమవారం సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు, ఆస్పత్రి పాలనాయంత్రాంగం, తెలంగాణ వైద్యవిద్య మౌలిక సదుపాయాల కల్పన సంస్థ అధికారులతో కలిసి సదరు భవనంలో ఎనిమిది అంతస్తుల్లో నూతనంగా ఏర్పాటు చేసిన పలు విభాగాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. నిష్ణాతులైన వైద్యులు, అధునాతన వైద్య యంత్రాలు, పలు రకాల వసతులు, సౌకర్యాలతో కూడిన ఐసీయూ, ఆధునిక ఆపరేషన్ థియేటర్లతో పాటు మరో రెండు వందల పడకలు అదనంగా అందుబాటులోకి వస్తాయన్నారు. గాంధీలో ప్రస్తుతం నెలకు సుమారు 800 ప్రసవాలు జరుగుతుండగా, ఎంసీహెచ్ భవనం అందుబాటులోకి వస్తే ప్రసవాల సంఖ్య రెట్టింపు అవుతుందని వివరించారు. ఆయన వెంట ఆర్ఎంఓ–1 జయకృష్ణ, పలు విభాగాలకు చెందిన వైద్యులు, ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

అపార్ట్‌మెంట్‌లో కూలిన బాల్కనీ పిట్టగోడ

అమీర్‌పేట: దివ్యశక్తి అపార్ట్‌మెంట్‌లో ఓ బాల్కనీ పిట్టగోడ సోమవారం కురిసిన భారీ వర్షానికి కూలిపోయింది. అపార్ట్‌మెంట్ 3వ బిల్డింగ్‌లోని మొదటి అంతస్తులో ఓ ఫ్లాట్‌కు చెందిన బాల్కనీ పిట్టగోడ మొత్తం పెచ్చులూడి కింద వాహనాలపై పడ్డాయి.పెద్ద శబ్దం రావడంతో నివాసితులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న డీఆర్ఎఫ్ సిబ్బంది ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. అయితే.. పిట్టగోడ వర్షానికి కూలిపోలేదని, కుండీల్లోని మొక్కలకు నీళ్లు పోస్తుండటంతో గోడ నానుతూ వస్తుందని, దీనికి తోడు సాయంత్రం కురిసిన భారీ వర్షానికి కూలిపోయిందని అపార్ట్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధి ఒకరు తెలిపారు.

కంటోన్మెంట్‌ల విలీనంపై ముందుకే..

- పార్లమెంట్‌లో రక్షణ శాఖ సహాయ మంత్రి ప్రకటన
- రాష్ట్రాలతో సంప్రదింపులు కొనసాగుతున్నాయని వెల్లడి

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌ల భవితవ్యంపై కొనసాగుతున్న ఊహాగానాలకు తెరవేస్తూ ఎట్టకేలకు కేంద్రం స్పష్టమైన ప్రకటన చేసింది. దేశ వ్యాప్తంగా 58 కంటోన్మెంట్‌లలోని సివిలిన్ ప్రాంతాలను సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేయనున్నట్లు రక్షణ శాఖ సహాయ మంత్రి అజయ్ భట్ రాజ్యసభలో ఓ ప్రశ్నకు సమాధానం ఇస్తూ స్పష్టం చేశారు. వివిధ రాష్ట్రాలోని మున్సిపాలిటీలు, కంటోన్మెంట్‌ల పాలనలోని సివిలియన్ ప్రాంతాల్లో ఒకే తరహా పాలన ఉండాలన్న లక్ష్యంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామని ఆయా రాష్ట్రాలతో సంప్రదింపులు కొనసాగుతున్నాయని, ఈ నేపథ్యంలో కచ్చితమైన కాలపరిమితి వెల్లడించలేమన్నారు. కంటోన్మెంట్‌లలోని సివిలియన్ ప్రాంతాలను వేరు చేయాల్సిందిగా పలువురు ప్రజాప్రతినిధులతో పాటు ప్రజల నుంచి కూడా పెద్ద ఎత్తున వినతులు వచ్చాయని ఇప్పటి వరకు కంటోన్మెంట్‌లోని సివిలియన్ ప్రాంతాల్లో ఆయా రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు అమలుకు ఎలాంటి అడ్డంకుల్లేవన్నారు. కంటోన్మెంట్‌లను సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేశాక, అంతకు ముందు బోర్డు ఆధీనంలోని ఆస్తులు, నిధులు అన్నీ సంబంధిత మున్సిపల్ ఆధీనంలోకి వెళ్తాయన్నారు.

పైలట్‌గా ఎంపిక చేసి..

12 ఏళ్ల క్రితం నాటి క్యాస్ యోల్ అంశంతో సంబంధం లేకుండా మిగతా కంటోన్మెంట్‌లను సైతం సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేయాలని కేంద్రం నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా దేశంలోనే అతిపెద్ద సికింద్రాబాద్ కంటోన్మెంట్‌తోనే ఈ ప్రక్రియ ప్రారంభించారు. తద్వారా ఇక్కడ తలెత్తే సమస్యల పరిష్కారం మిగతా కంటోన్మెంట్‌లకు ఉదాహరణగా పనికొస్తుందని భావించారు. ఈ మేరకు 2023 జనవరి 4న కేంద్రం ఓ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి నెలరోజుల్లో నివేదిక ఇవ్వాలని సూచించింది. ఫిబ్రవరి మొదటి వారంలో కమిటీ నివేదిక ఇచ్చాక దీనిపై ఎలాంటి కదలిక లేదు. దీంతో స్థానికంగా తీవ్ర సందిగ్ధత నెలకొంది. అడపాదడపా రక్షణ శాఖ చర్యలతో విలీనంపై ఊహాగానాలు మినహా అధికారిక సమాచారం మాత్రం వెల్లడి కాలేదు. తాజాగా రక్షణ శాఖ సహాయ మంత్రి ప్రకటనతో కేంద్రం విలీనానికి సిద్ధంగా ఉందని తెలుస్తున్నప్పటికీ, ఎప్పటి వరకు ఈ ప్రక్రియ పూర్తవుతుందో మాత్రం స్పష్టత రాలేదు.

హాస్టళ్ల సమస్యలను పరిష్కరించండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పరిశోధన విద్యార్థులు డిమాండ్ చేశారు. సోమవారం పరిశోధన విద్యార్థి చనగాని దయాకర్ ఆధ్వర్యంలో హాస్టళ్లను సందర్శించారు. వర్షాల కారణంగా భవనాలు కురుస్తున్నాయని, పైకప్పులు పెచ్చులూడి పడుతున్నాయన్నారు. విద్యార్థుల నుంచి అధికంగా మెస్ బిల్లులు వసూలు చేస్తున్న హాస్టళ్ల నిర్వహణలో అధికారులు విఫలమయ్యారన్నారు. వీసీ క్యాంపస్‌లోని హాస్టళ్లు, భోజనశాలలను సందర్శించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు బస్‌పాస్‌ల పంపిణీ

కంటోన్మెంట్: శ్రీగణేశ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 500 మందికిపైగా విద్యార్థులకు ఉచిత బస్‌పాస్ పొందేందుకు అవసరమైన సహకారాన్ని అందజేశారు. మారేడుపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులతో కలిసి బస్‌పాస్‌లు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీగణేశ్ మాట్లాడుతూ.. ఇటీవల తాను ఆర్టీసీ అధికారులను కలిసిన సందర్భంలో బస్‌పాస్‌ల అంశాన్ని తన దృష్టికి తెచ్చారని వెల్లడించారు. సర్వీసు ఛార్జీలు ఇతరత్రా ఖర్చులు భరించలేని విద్యార్థులు ప్రభుత్వం అందించే ఉచిత బస్‌పాస్‌లను సైతం వినియోగించుకోవడం లేదని తనతో విన్నవించినట్లు తెలిపారు. దీంతో నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులందరికీ బస్‌పాస్‌లు అందించేందుకు అవసరమయ్యే ఖర్చును పూర్తిగా తానే భరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ డిపో మేనేజర్ రామ్మోహన్, హెడ్ మాస్టర్ మనోహర చారీ, స్కూల్ ఇంచార్జి అనురాధ, యూసఫ్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఎఫ్‌టీయూ తెలంగాణ రాష్ట్రకమిటీ ఆధ్వర్యంలో ఆగస్టు 4న ఇందిరా పార్కు వద్ద నిర్వహించనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షురాలు ఎస్ఎల్ పద్మ కోరారు. సోమ వారం ఓయూ క్యాంపస్ లేడీస్ హాస్టల్ ఎదుట కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులతో కలిసి మహాధర్నాకు సంబంధించి వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. శ్యామల, జయ, సావిత్రి, పద్మ, విజయ, భార్గవి, లత, లక్ష్మీ పాల్గొన్నారు.